# భద్రత.. భరోసా..

- పాఠశాల స్థాయిలోనే బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేలా విద్యాశాఖ చర్యలు
- ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బాలికల సాధికారత క్లబ్‌లు
- సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేలా తోడ్పాటు
- రంగారెడ్డి జిల్లాలో వంద పాఠశాలల్లో జీసీఈసీ క్లబ్‌ల ఏర్పాటు



**ఆదిలోనే సమస్యకు పరిష్కారం చూపేలా..**

ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు భద్రతతోపాటు భరోసా కల్పించేందుకు బాలికల సాధికారత క్లబ్(జీసీఈసీ)లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటు కోసం విద్యాశాఖ ఈ నెల మొదటి వారంలోనే ఉత్తర్వులు జారీ చేయడంతో రంగారెడ్డి జిల్లాలో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. కస్తూర్బా పాఠశాలతోపాటు ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను కలిపి వంద పాఠశాలలను ఎంపిక చేసి క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లబ్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చైర్మన్‌గా, ఉపాధ్యాయురాలు కన్వీనర్‌గా, ఒక మహిళా కానిస్టేబుల్, షీ టీమ్ ఇన్‌చార్జితోపాటు ప్రతి తరగతికి ఇద్దరు విద్యార్థినులు సభ్యులుగా ఉంటారు. బాలికలకు శారీరక, లైంగిక వేధింపులు జరగకుండా చూడడం.. లైంగిక దాడుల నుంచి రక్షణ కల్పించడం.. బాల్య వివాహాలు జరగకుండా చూడడం తదితర అంశాలపై సాధికారత క్లబ్‌లు అవగాహన కల్పించనున్నాయి. అలాగే కౌమార బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, లింగ సమానత్వం, జీవన నైపుణ్యాల పెంపు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, బాలికలపై హింసను అరికట్టేలా క్లబ్ సభ్యులు చర్యలు చేపడతారు. బాలబాలికలు ఉన్న పాఠశాలల్లో బాలురు బాలికలతో ఏ విధంగా వ్యవహరించాలో తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రతి నెలా విధిగా సమావేశాలు నిర్వహించి ఎక్కడైనా బాలికలకు సమస్యలు ఎదురైతే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

రంగారెడ్డి, డిసెంబరు 27 (నమస్తే తెలంగాణ) : బాలికలకు భరోసా కల్పించేలా గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన విధానాలనే ఈసారి కూడా విద్యాశాఖ కొనసాగిస్తున్నది. గతంలో మాదిరిగానే విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, కస్తూర్బా పాఠశాలల్లోని వంద పాఠశాలల్లో క్లబ్‌లను ఇటీవలే ఏర్పాటు చేశారు. విజ్ఞానం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం తదితర వాటిని పెంపొందింపజేసి పాఠశాల స్థాయిల్లోనే బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా క్లబ్ ప్రణాళికలను రూపొందించారు. ఎన్నో సామాజిక సమస్యల నుంచి బాలికలకు భద్రత కల్పించడంలో సాధికారత క్లబ్‌లు కీలకపాత్ర పోషించనున్నాయి.




### ఆత్మస్థైర్యం నింపేందుకే..

పాఠశాలల్లో చదివే కౌమార బాలికలకు అనేక సమస్యలు ఎదురవుతాయి. వీటి వల్ల వారు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పాఠశాలల్లో జీసీఈసీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నది. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈ క్లబ్‌లు దోహదపడుతాయి. ప్రతి నెలా సమావేశమై కౌమార బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపులు తదితర సమస్యలను చర్చించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.

**- సుజాత, జెండర్ ఈక్విటీ కో-ఆర్డినేటర్, రంగారెడ్డి జిల్లా**

### ప్రజా పాలన
## ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా ఇ.శ్రీధర్

రంగారెడ్డి, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం గురువారం నుంచి నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలవారీగా నోడల్ అధికారులను నియమించింది. నోడల్ అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఐఏఎస్ అధికారి ఇ.శ్రీధర్‌ను నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. జిల్లాలో నేటి నుంచి జనవరి 6 వరకు జరుగనున్న ప్రజా పాలన గ్రామ సభల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణలను జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షించనున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి లలితాకుమారి

## నాణ్యమైన విద్యనందించాలి
### పెద్దేముల్ అంగన్‌వాడీ కేంద్రం-1ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా సంక్షేమ అధికారి లలితాకుమారి

పెద్దేముల్, డిసెంబర్ 27 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంతోపాటు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించాలని జిల్లా సంక్షేమ అధికారి లలితాకుమారి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. చిన్నారులతో తెలుగు, ఇంగ్లిష్ రైమ్స్, ఏబీసీడీలు, నెంబర్లు, బాడీ పార్ట్స్, యాక్టివిటీ(కృత్యాలు) తప్పకుండా చేయించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ఎంతమంది ఉన్నారు తదితర అంశాలపై ఆరా తీశారు. వచ్చే నెల ఇండెంట్ పెట్టాలని, ఎఫ్‌కేఆర్ రిజిస్టర్ మెయింటేన్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఏబీసీడీలు, నెంబర్లు చెప్పకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌ను మందలించారు. అనంతరం అన్ని రికార్డులను లలితాకుమారి క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, మీనాక్షి, ఆయా ఉన్నారు.

# 'ప్రజా పాలన'ను పకడ్బందీగా నిర్వహించాలి



ప్రజాపాలనపై ప్రజాప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- అధికారులు ప్రజలతో మర్యాదపూర్వంగా, సున్నితంగా మెలగాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం కింద అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణపై స్పీకర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం దిశా నిర్దేశం సమావేశాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల పాటు కొనసాగే ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలలో 5 పథకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ వారం రోజుల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా, సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా పాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రజాపాలన బృందాలు సమయ పాలన పాటించాలని, షెడ్యూల్ ప్రకారం గ్రామాలు, వార్డులకు వెళ్లాలన్నారు. నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. గ్రామసభలు నిర్వహించే గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వద్ద తాగు నీరు, టెంట్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల స్థాయి బృందాల ఏర్పాటు, గ్రామ సభ నిర్వహణపై ముందుగానే గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందించేలా పత్రికలు, సోషల్ మీడియా, ఫ్లెక్సీలు, సైన్ బోర్డ్స్‌తో పాటు టాంటాం ద్వారా ప్రచారం చేపట్టాలని ఆయన తెలిపారు. అధికారులు అలసత్వం వహించకుండా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా శ్రద్ధగా విధులు నిర్వహిస్తూ అమలు పరిచేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు ప్రజలు తమ దరఖాస్తులను పూరించడంలో అనుమానాలను నివృత్తి చేస్తూ వారికి సహకరించాలని స్పీకర్ సూచించారు. అధికారులు ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ ప్రజలతో మమేకమై సమన్వయంతో ప్రజలకు సేవలందించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకే కాకుండా.. నాలుగు నెలలకు ఒకసారి వివిధ అంశాలపై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవో విజయకుమారి, డీఎస్పీ నర్సింహులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సురేశ్, శ్రీదేవి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### ప్రజాపాలనను సమర్థవంతంగా నిర్వహిద్దాం

కొడంగల్ : రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారెంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని డ్వామా పీడీ కృష్ణన్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రజాపాలన కార్యక్రమంపై సందేహాలు, సూచనలు అందజేశారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి 100 ఇండ్లకు సంబంధించి ఓ అధికారిని ఏర్పాటు చేసి ఒక రోజు ముందుగానే దరఖాస్తులను ఇంటింటికీ అందించాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి గ్రామ సభలో స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు సంబంధించి మూడు రోజుల ముందుగా గ్రామాల్లో దండోరా వేయించడంతో పాటు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. విద్యుత్, మిషన్ భగీరథ వంటి వాటికి సంబంధించి తదితర సమస్యల దరఖాస్తులు అందిస్తే స్వీకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, దౌల్తాబాద్ ఎంపీపీ విజయ్‌కుమార్, జడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో పాండు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఫారెస్ట్ డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, వ్యవసాయాధికారి ఏడీఏ శంకర్‌రాథోడ్ పాల్గొన్నారు.


ప్రజాపాలన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ కృష్ణన్

### ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు సమర్పించాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27 : ఎన్నికల ఖర్చుల రికాన్సిలియేషన్ ఈ నెల 29న జరుపుతున్నందున నవంబర్ 30న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించి జమ, ఖర్చుల్లో వ్యత్యాసాలు సరిచేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతం పోట్రు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీరయ్యయాదవ్

## బీసీ కుల గణన చేపట్టాలి

మర్పల్లి, డిసెంబర్ 27 : బీసీ కుల గణన ఎన్నికలకు ముందే చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల గణన చేపట్టకపోవడంతో దేశంలో 50 శాతం ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణన లెక్కలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఉద్యమాలు చేపడుతామన్నారు.